నమస్తే తెలంగాణ

అక్రమ అరెస్ట్

> ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ అరెస్ట్ జరిగింది. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, ఈడీ అరెస్ట్ చేయడం న్యాయ హక్కులకు వ్యతిరేకం. అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.
>
> -పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ స్పీకర్

శుక్రవారం రాత్రి ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి కవితను తీసుకెళ్తున్న దర్యాప్తు బృందం

ఈడీ.. కోర్టు ధిక్కారం!

మొదటిపేజీ తరువాయి...

కేసులకు కూడా వర్తిస్తాయా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. దీనిపై నళిని చిదంబరం, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ సతీమణి రుజిరా బెనర్జీతో పాటు కవిత కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశం ఇప్పటికీ కోర్టు పరిధిలోనే ఉన్నది. అయినప్పటికీ, ఇవేమీ పట్టించుకోని ఈడీ అధికారులు.. కవితను అరెస్టు చేశారు. సూర్యాస్తమయం తర్వాత మహిళను అరెస్టు చేయాల్సివస్తే, స్థానికంగా ఉండే ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలని, ట్రాన్సిట్ వారెంట్ (రాష్ట్ర సరిహద్దులను దాటేందుకు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఇచ్చే ఆదేశాల పత్రం) లేకుండా రాష్ట్రం దాటించకూడదని సీఆర్‌పీసీ చట్టంలో స్పష్టంగా ఉన్నది. ఈ నిబంధనలను బేఖాతరు చేసిన ఈడీ.. కవితను ఏకపక్షంగా అరెస్టు చేసి ఢిల్లీకి తరలించింది.

సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగానే..

ఢిల్లీ మద్యం కేసులో విచారణకు హాజరుకావాలంటూ ఈడీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు శుక్రవారం పేర్కొన్నది. అయితే, కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే ఈడీ ఓ ప్రకటన చేసింది. కవితపై ఎలాంటి లీగల్ యాక్షన్ తీసుకోబోమని సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు కోర్టులో అండర్‌టేకింగ్‌ను (ఎలాంటి లీగల్ యాక్షన్ తీసుకోబోము అని రాతపూర్వక హామీ) కూడా సమర్పించింది. అయితే, కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదన్న విషయాన్ని పక్కనబెట్టిన ఈడీ.. ఢిల్లీ నుంచి ఆగమేఘాలపై హైదరాబాద్‌కు వచ్చి కవిత ఇంట్లో సోదాలు నిర్వహించి, అరెస్టు చేసింది.

ఈ ప్రశ్నలకు జవాబేది?

అండర్‌టేకింగ్ సమర్పించిన తర్వాత ఎలా అరెస్టు చేస్తారని, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా కవితను ఢిల్లీకి ఎలా తరలిస్తారని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఈడీ అధికారులను ప్రశ్నించారు. అయితే, సుప్రీంకోర్టుకు ఇచ్చిన అండర్‌టేకింగ్‌ని వెనక్కి తీసుకుంటున్నామని ఈడీ అధికారులు బదులివ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈడీ ఇచ్చిన అండర్‌టేకింగ్‌ను మళ్లీ అదే ఈడీ వెనక్కి తీసుకోవాలనుకొన్నప్పటికీ, దానికి కోర్టు అనుమతి తప్పనిసరిగా అవసరం ఉంటుందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మోహిత్‌రావు పేర్కొన్నారు. దీన్ని ఈడీ పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు.

కోర్టు ధిక్కరణకు భారీ మూల్యం

కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్స్ యాక్ట్-1971 ప్రకారం.. కోర్టు ధిక్కరణను రెండు రకాలుగా విభజిస్తారు. మొదటిది సివిల్ కంటెంప్ట్. రెండోది క్రిమినల్ కంటెంప్ట్. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే అనుసరించకపోవడాన్ని సివిల్ కంటెంప్ట్ ఆఫ్ కోర్టుగా పరిగణిస్తారు. ఆదేశాలను పాటించకుండా కోర్టు గౌరవాన్ని దిగజార్చేలా చేయడం, న్యాయ పరిపాలన ప్రక్రియలకు అడ్డు తగలడం వంటివి క్రిమినల్ కంటెంప్ట్ కిందకు వస్తాయి. కోర్టు ధిక్కరణ చర్యకు శిక్షగా ఆరు నెలల జైలు శిక్ష విధించవచ్చు. లేదా రూ.2 వేల వరకు జరిమాన విధించవచ్చు. కొన్నిసార్లు రెండు శిక్షలు కూడా వేయొచ్చు. కవిత కేసు విషయంలో ఈడీ అధికారులు సివిల్‌తో పాటు క్రిమినల్ కంటెంప్ట్‌కు కూడా పాల్పడినట్టు అర్థమవుతున్నదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ కుట్ర

- బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను మానసికంగా దెబ్బతీసేందుకు ఎమ్మెల్సీ కవిత అరెస్ట్
- ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందురోజు అరెస్ట్ చేయడం రాజకీయ దురుద్దేశమే
- మాకు అరెస్ట్‌లు, వేధింపులు కొత్తకాదు
- కవిత అరెస్ట్‌ను రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటాం
- కవిత అరెస్ట్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు
- నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసిన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వేముల, కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, మార్చి 15(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి చేస్తున్న రాజకీయ కుట్ర అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కవితను అరెస్ట్ చేయడం ద్వారా బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను మానసికంగా కుంగదీసి పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది అప్రజాస్వామికం, అనైతికం, అక్రమమని, కవిత అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈడీ అధికారులు శుక్రవారం ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసిన నేపథ్యంలో హరీశ్‌రావు తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఒక రోజు ముందు అరెస్ట్ చేయడం పూర్తిగా రాజకీయ దురుద్దేశం, కుట్రపూరితమని పేర్కొన్నారు. ఏడాది క్రితం కవితకు సాక్షిగా నోటీసు ఇచ్చి, ఇప్పుడు అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయాలన్న దురుద్దేశం, బురదజల్లాలనే పథకంలో భాగంగానే కవితను బీజేపీ ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని దుయ్యబట్టారు.

ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదు

కవిత అరెస్ట్‌ను కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కుగా హరీశ్‌రావు అభివర్ణించారు. ఈ రెండు పార్టీల దుర్మార్గమైన చర్యను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని, ప్రజాక్షేత్రంలో ఆ రెండు పార్టీలకు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఉదయం సెర్చ్ అన్నారని, సాయంత్రానికి అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈడీ అధికారులు ముందుగానే ప్లాన్ చేసుకొని వచ్చారని, అరెస్ట్ చేసి తీసుకెళ్లేందుకు విమాన టికెట్లు కూడా ముందుగానే బుక్ చేసుకున్నారని తెలిపారు. కోర్టుకు వెళ్లే అవకాశం లేకుండా సాయంత్రం 6 తర్వాత అరెస్ట్ చేశారని వివరించారు.

బీఆర్‌ఎస్‌కు ఉద్యమాలు కొత్తేమీ కాదు

బీఆర్‌ఎస్ ఉద్యమాల పార్టీ అని, తమకు అరెస్టులు, వేధింపులు, కుట్రలు కొత్తవేమీ కాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలాంటివెన్నో ఛేదించి రాష్ట్రాన్ని సాధించామని చెప్పారు. కవిత అక్రమ అరెస్ట్‌పై ప్రజాక్షేత్రంలో ఉద్యమిస్తూనే, న్యాయపరంగానూ ఎదుర్కొంటామని తెలిపారు.సుప్రీంకోర్టులో కేసు వేసి న్యాయపరంగా కొట్లాడుతామని చెప్పారు.

సుప్రీంలో కేసు నడుస్తుండగా అరెస్ట్ ఎందుకు?

పశ్చిబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కుటుంబసభ్యురాలిపై, నళిని చిదంబరంపై, కవితపై.. ఇలా మహిళలను ఈడీ అరెస్ట్ చేయొచ్చా? లేదా? అనే అంశంపై సుప్రీంకోర్టులో విచారణ నడుస్తున్నదని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ కేసు సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణకు వచ్చిందని, 19కి వాయిదా పడిందని తెలిపారు. అయితే అంతకుముందే ఈ కేసులో కవితపై తీవ్రమైన చర్యలు తీసుకోబోమని స్వయంగా ఈడీనే సుప్రీంకోర్టుకు తెలిపిందని గుర్తుచేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానానికి ఇచ్చిన మాటకు విరుద్ధంగా, ఒక మహిళను శుక్రవారం రోజు, అదీ రాత్రిపూట అరెస్ట్ చేయడం కచ్చితంగా రాజకీయ కుట్రేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరో మూడు రోజుల్లో ఈ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ ఉండగా అంత అర్జెంట్‌గా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

పార్లమెంట్ ఎన్నికల్లో తమను దెబ్బతీయాలనే కుట్రతోనే అరెస్ట్ చేశారనేది రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎమర్జెన్సీని మించిన పరిస్థితి ఇది అని, దౌర్జన్యంగా కవిత అరెస్ట్ జరిగిందని విమర్శించారు. కక్షసాధింపు రాజకీయాలకు, ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుట్ర: జగదీశ్‌రెడ్డి

కవిత అరెస్ట్‌ను రాజకీయ కుట్ర కోణంలోనే చూస్తున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కవితకు సంవత్సరమున్నర క్రితమే నోటిసులు ఇచ్చినా విచారణకు సహకరించారని తెలిపారు. బీజేపీ తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి, లొంగదీసుకోవడానికి, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కుట్రలు చేస్తున్నదని దుయ్యబట్టారు. గడిచిన పదేండ్లలో అనేక రాష్ర్టాల్లో ప్రతిపక్ష పార్టీ నేతలకు నోటీసులు ఇవ్వడం, వారు బీజేపీలో చేరగానే వాటిని రద్దు చేయడం జరుగుతున్నదని చెప్పారు.. అదే పద్ధతిలో బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను లొంగదీసుకోవాలని బీజేపీ ప్రయత్నం చేసిందని, కానీ దేశంలో బీజేపీకి కేసీఆర్ ఎదురునిలిచారని, అది సహించలేక దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు.

అర్ధరాత్రి ఈడీ కార్యాలయానికి కవిత

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లో ఆమె ఇంటి నుంచి అరెస్టు చేసిన ఈడీ అధికారులు శుక్రవారం రాత్రి ఢిల్లీ తీసుకువచ్చారు. రాత్రి సుమారు 12.00 గంటల ప్రాంతంలో ఆమెను ఈడీ కేంద్ర కార్యాలయం పరివర్తన్ భవన్‌కు తరలించారు. అయితే ఢిల్లీలో కూడా పోలీసులు హైడ్రామాకు తెరలేపారు. ఎయిర్‌పోర్టు వద్ద కవిత మీడియా కంటపడకుండా ఈడీ అధికారులు ఆమెను వేరే గేటు గుండా తమ కార్యాలయానికి తరలించారు. ఇక పరివర్తన్ భవన్ వద్ద 144 సెక్షన్ విధించారు. ఈడీ కార్యాలయంలో కవితను ప్రత్యేక సెల్‌లో ఉంచారు. అక్కడే వైద్య బృందం ఆమెకు పరీక్షలు నిర్వహించింది.

నేడు కోర్టు ముందుకు..

కవితను శనివారం ఉదయం రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నారు. న్యాయస్థానం కవితను ఈడీ కస్టడీకి ఇస్తుందా.. లేదా అన్నది చూడాలి. ఒకవేళ ఈడీ కస్టడీకి ఇవ్వకపోతే 14 రోజుల రిమాండ్ విధించే అవకాశం ఉన్నది.

బెయిల్ పిటిషన్‌కు ఏర్పాట్లు

తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ కవిత రౌస్ అవెన్యూ కోర్టులో బెయిల్ పిటిషన్ వేయనున్నట్టు తెల్సింది. ఈ మేరకు ఆమె న్యాయవాదుల బృందం బెయిల్ పిటిషన్‌ను సిద్ధం చేస్తున్నది.

ఢిల్లీకి బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో పలువురు బీఆర్‌ఎస్ నేతలు శుక్రవారం రాత్రే ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. మరికొంత మంది నేతలు శనివారం బయల్దేరి వెళ్లనున్నారు. శుక్రవారం రాత్రి ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ తదితరులు ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. శనివారం ఉదయం మరికొంత మంది ముఖ్యనేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు. కవిత అరెస్టు నేపథ్యంలో న్యాయపరమైన అంశాలపై చర్చించేందుకు వీరు ఢిల్లీకి వెళ్తున్నట్టు తెలిసింది.

కేసీఆర్‌తో పార్టీ నేతల సమావేశం

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ నేతలు సమావేశమయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై పార్టీ నేతలతో సమావేశంలో ఉన్న కేసీఆర్‌కు తన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ అధికారులు సోదాల విషయం తెలియగానే మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు కవిత నివాసానికి వెళ్లారు.

రైతును కాటేసిన కరెంట్

పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతు కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి

మల్లయ్య (ఫైల్)

మానకొండూర్ రూరల్, మార్చి 15: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆ రైతు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలో చోటుచేసుకున్నది. దేవంపల్లికి చెందిన మంద మల్లయ్య (55) శుక్రవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. తన అన్న చేను నుంచి పొలానికి వెళ్తుండగా, విద్యుత్తు తీగలు తెగిపడి ఉన్నాయి. ఆ తీగల ను గమనించకుండానే మల్లయ్య తన పొలం వద్దకు వెళ్తుండగా కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. బాధిత కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్ కుమార్ తెలిపారు.

మన గల్లీల్లో ఢిల్లీ పెద్దలు

ఒకేరోజున రాష్ట్రపతి, ప్రధాని పర్యటన

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం శుక్రవారం ప్రముఖులతో సందడిగా మారింది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీ ఒకేరోజు నగరంలో పర్యటించారు. కన్హాశాంతి వనాన్ని సందర్శించిన రాష్ట్రపతి అక్కడ నిర్వహించిన ఆధ్మాత్మిక వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి ఢిల్లీకి వెళ్లిపోయారు. ప్రధాని మోదీ మల్కాజిగిరిలో 1.2 కిలోమీటర్ల మేర బీజేపీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రధాని రాత్రికి ఇక్కడే బస చేశారు. శనివారం మరో కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఢిల్లీకి వెళ్తారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ కూడా శనివారం హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

పీవీకి భారతరత్నపై ఎన్నారైల హర్షం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): పీవీ నర్సింహారావుకు భారతరత్న రావటం పట్ల ఆస్ట్రేలియాలో ఉన్న ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తంచేశారు. పీవీకి భారతరత్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కృషికి దక్కిన ఫలితంగా వారు అభివర్ణించారు. సిడ్నీలోని ఓం బుష్ కమ్యూనిటీ సెంటర్ పార్క్‌లో బీఆర్‌ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్, పీవీ జయంతోత్సవాల కమిటీ సభ్యుడిగా వ్యవహరించిన మహేశ్ బిగాల, సిడ్నీ డిప్యూటీ మేయర్ శాండీరెడ్డి, పలువురు ప్రవాసులతో కలిసి పీవీ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

3 విచారణలు.. 6 వేధింపులు

- 100 రోజుల కాంగ్రెస్ పాలన ఇదే
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- పార్టీ గేట్లు కాదు, ప్రాజెక్టుల గేట్లు ఎత్తండి ఎండిన పంటలకు ఎకరానికి
- రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- 174 మంది రైతులు..38 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు
- లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరిక

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం నాయకుడు దేవీప్రసాద్ తదితరులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): 100 రోజుల పాలనలో కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. 100 రోజుల పాలన కాస్తా యూటర్న్, యూట్యూబ్ పాలనగా సాగిందని ఎద్దేవా చేశారు. రైతులు, మహిళలు, యువత, చేనేత కార్మికులు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. వంద రోజుల్లో 174 మంది రైతులు, 38 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, చేనేత కార్మికుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హస్తం కాస్తా ప్రజలపాలిట భస్మాసుర హస్తంగా మారిందన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ వందరోజుల పాలన మూడు విచారణలు.. ఆరు వేధింపులు అన్నట్టుగా సాగిందని ఎద్దేవా చేశారు. మొదటి సంతకం రుణమాఫీ మీదేనంటూ మాటతప్పారని, కుర్చీ ఎక్కడాన్ని మాత్రం రెండు రోజులు ముందుకు జరుపుకొన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రగతిభవన్‌ను కూల్చి నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పి అందులో డిప్యూటీ సీఎం ఉంటున్నారని పేర్కొన్నారు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పారని, తామిచ్చే రైతుబంధును ఇప్పటివరకు పూర్తిగా ఇవ్వలేని మండిపడ్డారు. ఆసరా పింఛన్లు పెంచుతామని చెప్పి ఉన్న పింఛన్లు కూడా సరిగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తెలంగాణ పరువు పెంచే ప్రయత్నం చేస్తే, రేవంత్‌రెడ్డి కరువు పెంచేందుకు పోటీపడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో పచ్చటి పొలాలు కనిపిస్తే 10 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ పాలనలో పంటలకు మంట పెట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో తాగునీటికి, సాగునీటికి లోటు లేదని, రేవంత్ పాలనలో కన్నీటికి కొరత లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. మిషన్ భగీరథతో తాము ఇంటింటికీ నీళ్లు అందించామని గుర్తుచేశారు.

100 రోజుల్లో సాధించింది ఏమన్నా ఉందా?

వంద రోజుల్లో కాంగ్రెస్ సాధించినదని ఏమైనా ఉందా.. అంటే రేవంత్‌రెడ్డి 10సార్లు ఢిల్లీకి వెళ్లి రావడమేనని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గొల్లకురుమలకు 100 రోజుల్లో గొర్రెలు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ఆరోగ్యంపైనా దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని నాడు పేర్కొన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు బీజేపీ నాయకుల ఇండ్లకు వెళ్తున్నాడని అన్నారు. ఫార్మాసిటీ, మెట్రో సహా పలు విషయాల్లో రేవంత్ యూటర్న్ తీసుకున్నారని దుమ్మెత్తి పోశారు. ఎత్తాల్సింది పార్టీ గేట్లు కారని, ప్రాజెక్టుల గేట్లు అని సూచించారు. కష్టాల్లో ఉన్న రైతులకు సాగునీరు అందించి సాయం చేయాలని కోరారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు

కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వానకాలం పంటకు ఎలాగూ బోనస్ ఇవ్వలేదని, కనీసం యాసంగి పంటకైనా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని విమర్శించారు. కాంగ్రెస్ బాండ్ పేపర్లు రాసిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మోసాలను చూసి ఓటేయాలని కోరారు. మ్యానిఫెస్టోలోని అంశాల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయాలని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నమ్ముకున్నందుకు ఆటో, చేనేత, రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. 100 రోజులపాలనలో సాధించిన అప్రతిష్ఠ, ఆత్మహత్యలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు పెంచాలని ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేస్తే విద్యార్థులను అరెస్టు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో మోటార్లు కాలలేదని, రైతన్నను కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 10 వేల నష్టపరిహారం చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

వారందరికీ తులం బంగారం ఇవ్వాల్సిందే

ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తామని చెప్పి మూడు నెలలు అవుతున్నా ఇప్పటికీ ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం మహిళలకు రూ. 7,500 కోట్లు బకాయి పడిందని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జరిగిన పెండ్లిళ్లకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో 44 లక్షలమంది పింఛనుదారులు ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టబోతున్నారని హెచ్చరించారు. నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి ఏమైందని ప్రశ్నించారు. ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలకు మిగిలింది మరో 265 రోజులు మాత్రమేనని గుర్తు చేశారు. మెడమీద కత్తిపెట్టి తమ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని హరీశ్‌రావు హెచ్చరించారు.

లోకం పోకడ



ఉష్ణోగ్రత కూడా ఓ పది డిగ్రీలు తగ్గిస్తామని చెప్పండి సార్!

బీఎస్పీకి 2, బీఆర్ఎస్‌కు 15

- రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు పూర్తి
- బీఎస్పీకి హైదరాబాద్, నాగర్‌కర్నూల్ సీట్లు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీఎస్పీ పార్టీల మధ్య సీట్లు సర్దుబాటు పూర్తయింది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు గాను 2 స్థానాల్లో బీఎస్పీ, 15 స్థానాల్లో బీఆర్‌ఎస్ కలిసి పోటీచేయాలని నిర్ణయించాయి. సీట్ల సర్దుబాటుపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఎస్పీ జాతీయ సెంట్రల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్, తెలంగాణ సెంట్రల్ కో-ఆర్డినేటర్ మంద ప్రభాకర్, పార్టీ నేతలు దయానంద రావు, విజయ్ ఆర్య, కే ఈశ్వర్ తదితరులు ఇప్పటికే దశలవారీగా చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్, హైదరాబాద్ సీట్లను బీఎస్పీకి కేటాయించాలని నిర్ణయించినట్టు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ప్రకటించారు.

11 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ పోటీచేయనున్న 15 స్థానాల్లో ఇప్పటికే 11 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఆత్రం సక్కు, మల్కాజిగిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఖమ్మం నుంచి నామా , మహబూబాబాద్ (ఎస్టీ) నియోజకవర్గం నుంచి మాలోత్ కవిత, కరీంనగర్ వినోద్‌కుమార్, పెద్దపల్లి (ఎస్సీ) స్థానం నుంచి కొప్పుల ఈశ్వర్, మహబూబ్‌నగర్ నుంచి మన్నే శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వరంగల్ (ఎస్సీ) నియోజకవర్గం నుంచి కడియం కావ్య, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలో దింపుతున్నట్టు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు.

కాంగ్రెస్‌వి కక్షపూరిత రాజకీయాలు

- గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్టును ఖండించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు, మార్చి 15: పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రతిపక్షాలను కానీ, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను కానీ ఏనాడూ వేధించలేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్టును హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. తమ పార్టీలో చేరాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బంధువులపై ఒత్తిడి తీసుకొస్తున్న కాంగ్రెస్ వారిపై అక్రమంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. పాలనను గాలికి వదిలి, ప్రతిపక్షాలను వేధిస్తున్నారని విమర్శించారు. వందలమంది పోలీసులతో వచ్చి తెల్లవారుజామున అరెస్ట్ చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధుసూదన్‌రెడ్డి ఏమైనా బందిపోటా? అని ప్రశ్నించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతోనే క్రషర్లపై విచారణ నిర్వహిస్తున్నామని స్వయంగా ఆర్డీవో చెప్పిన వీడియోను మంత్రి ఫోన్‌లో చూపించారు. మధుసూదన్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుందని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. తమ్ముడి అరెస్టుతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. క్రషర్‌ను పూర్తి అనుమతులతోనే నడిపిస్తున్నామని, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టంచేశారు.

హరీశ్‌రావు పరామర్శ

మధుసూదన్‌రెడ్డి అరెస్ట్ సమాచారం అందుకున్న హరీశ్‌రావు వెంటనే పటాన్‌చెరు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సఫానదేవ్, శంకర్‌యాదవ్, నర్రా భిక్షపతి, ఈర్ల దేవానంద్, దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడి అరెస్టు

గూడెం మధుసూదన్‌రెడ్డి అరెస్టయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున పటాన్‌చెరు శాంతినగర్‌లోని మధుసూదన్‌రెడ్డి నివాసాన్ని పోలీసు దిగ్బంధించి అరెస్టు చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. లక్డారంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యుల నిర్వహణలోని క్రషర్లలో కేటాయింపులకు మించి క్రషింగ్ జరిగిందని ఆరోపిస్తూ కేసు నమోదైంది. ఆయనను సంగారెడ్డి కోర్టుకు తరలిస్తుండగా బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకొనే ప్రయత్నం చేశాయి. పోలీసులు వారిని చెదరగొట్టారు. సంగారెడ్డిలో వైద్య పరీక్షల అనంతరం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టారు.